నాకు నచ్చిన కథ గురించి పాఠకులు విశ్లేషణ రాసి పంపితే ప్రచురిస్తాం. తగిన విశ్లేషణకు పారితోషికం ఉంటుంది

# నాకు నచ్చిన కథ 'వానకురిస్తే'

పరిచయం: చక్రవేణు

కేతు విశ్వనాథరెడ్డి

రాయలసీమ వాసులు కళ్ళల్లో వత్తులేసుకొని ఆకాశంలోని మబ్బులకేసి ఎగచూస్తూ వానచుక్కకోసం పరితపించడం తమ జీవన విధానంగా మారింది. ప్రతియేడూ భూమిలో విత్తనాలు జల్లే అదును కోసం పదును వాన కురిస్తే అని ఎదురుచూసి పంటలు పెడతారు. పైరు కొద్దిపాటి నీటి చలవతో సరసరా ఎదిగొస్తుంది. వానకురవదు, నీటి తేమ లేక నేలతల్లి మలమలమాడుతూ ఉంటే పెట్టిన పైరు కళ్ళ ముందే బుగ్గిపాలై రైతు కడుపు కోత మొదలవుతుంది. ప్రతి వర్షఋతువూ దగా చేసి మబ్బుల ముసుర్లు మాయగా జరిగిపోతూ ఉంటాయి.

వాన కురుస్తుందని, పంటలు పండుతాయని, బతుకులు బాగుపడతాయని, ప్రజలు ఆశలు నింపుకొని బతుకులెళ్ళదీస్తుంటారు. ఏరులు సాగేది లేదు, చెరువులు నిండేది లేదు, బావుల్లో చుక్కనీళ్ళు ఊరేది లేదు, పాతాళగంగను నమ్ముకొని కొత్తబావులు తవ్వి నీళ్ళకు బదులు రాతి బండలే సాక్షాత్కారం. తవ్విన బావుల్లో కొన్ని వందలడుగుల లోతుల్లోకి మిషను బోర్లు దించాలి, అప్పటికీ దొరికితే కాసిన్ని నీళ్ళు. ఊస పైపుల గుండా ఎగజిమ్మే కొద్దిపాటి నీళ్ళలోనే సేద్యం మొదలవుతుంది. జొన్నపైరు, మిరపపంట, నిమ్మచెట్లు వ్యవసాయం సాగి బాగా పంట చేతికొచ్చే సమయంలో ఉన్న బోరు నీళ్ళు ఉట్టిపాటును ఉడిగిపోతాయి. అప్పుల పాలైన రైతు గుండె నీరవుతుంది. విధిలేక మళ్ళీ అప్పులు సప్పులు చేసి కొత్త బావులు తవ్వడం, కొత్త బోర్లు, ఎన్ని చేసినా నీరు శూన్యం. బావి బోరులో నల్లరాయి పడి ఘాతం దిగక నీళ్ళు పడవని తెలిసి గుండెలు బద్దలయ్యే జీవితాలు. ఇది రాయలసీమ రైతుల జీవితాల్లో సాధారణమైపోయిన తీరు. ఈ తీరులో పెద్ద మార్పేమీ ఉండబోదని తెలిసినా రైతులు మాత్రం బతుకుపోరు సాగిస్తూ నీటికోసం చేయని ప్రయత్నాలంటూ ఉండవు. ఆకలితో అలమటించే పసికూనలు, పెళ్ళీడు కొచ్చి తిరుగాడే ఆడబిడ్డలు, కరువు కన్నీళ్ళలో అలమటించే కాపురాల ఘోష చెప్పనలవికాదు. అప్పులు తీరే మార్గం కనిపించదు. రక్తం పంచుకున్న బిడ్డలకన్నా మిన్నగా పైరు పంటల్ని పెంచి, కళ్ళముందే అవి మాడిపోతూ ఉంటే, కాటి పాలవుతున్నట్లు కుమిలిపోతారు. రాయలసీమలో రైతు బతుకును "వానకురుస్తే" కథలో కేతు విశ్వనాథరెడ్డిగారు చాలా వాస్తవికంగా చిత్రించారు.

"వానకురుస్తే! ఒక్క వానకురుస్తే అదునుకు కురుస్తే!!" అని ఆశ నిండిన కళ్ళతో ఆకాశం కేసి చూసే పాపయ్య అనే రైతు బాధను ఈ కథలో వివరించారు. మబ్బుపట్టిన ఆకాశాన్ని చూస్తూనే పాపయ్య కళ్ళల్లో ఆశ. వానకురుస్తే సమస్యలన్నీ గట్టెక్కుతాయి. నిమ్మకాపు చేతికొస్తుంది. తీగ సెనక్కాయ, జొన్నపంట వచ్చి బాకీలు సగం తీరిపోతాయి. భవిష్యత్తంతా తనముందు కనపడుతున్నట్లు ఊహించుకొని ఆతృత, ఆందోళనతో సతమతమై గుండెదడతో పదిరిపోతాడు. గుండెపగిలి చస్తానా, చావకూడదు, అప్పులు చేసి చచ్చాడన్న అపకీర్తి రాకూడదు. ఎదిగిన కొడుకుమీద అప్పుల భారాన్ని మోపకూడదు. కుటుంబం అనాథ పాలవరాదనుకుంటాడు. రేడియోలో కూడ వాన కురుస్తుందని చెబితే, ఇంకొంచెం ఆశ. పంచాయితీ రేడియో దగ్గర అన్నీ రాజకీయ చర్చలే, అవి వినలేక పోతాడు పాపయ్య.

రాజకీయాల్లో నిజాయితీ లేనప్పుడు, ఆ కబుర్లేవీ రైతు కడుపునింపవు కదా అనుకోవడం సరైనది. నిజానికి కరువు కాటకాలు కొనసాగుతూ ఉంటే రాజకీయ నాయకులకు పదవుల పబ్బమూ గడుస్తుంది, నిధుల పండగా ఉంటుంది. కరువును సొమ్ము చేసుకునే కరణాలు భచనల కోసం చందాలు పోగుచేసి భోంచేస్తారు. మూఢ నమ్మకాల మూర్ఖత్వం వీడని పెద్దలు జాతర్లు, జంతు బలులంటారు. కరువు గురించి కబుర్లు చెప్పే నాయకులకు చిత్తశుద్ధి ఉండదు. పాలించే పాలకులకు కరువు సమస్య పరిష్కారం పట్ల చిత్తశుద్ధే గనక ఉంటే, ప్రకృతి వైపరీత్యాన్ని అరికట్టడం సమస్యకాదు. ఆలోచిస్తే సరైన మార్గం దొరక్కపోదు. వర్షం నీటిని నిల్వ ఉంచే మార్గాల్లో చెక్‌డ్యాములు, మధ్య తరహా ప్రాజెక్టులు, బావుల త్రవ్వ[illegible]లు, భూ[illegible] జలాల కోసం బోర్లు వేయడం, ప్రభుత్వమే స్వయంగా నిజాయితీతో విస్తృతంగా కృషి చేస్తే భూమిలో నీటిమట్టం కుంగిపోదు. కృష్ణ, గోదావరి జలాలు సముద్రం పాలుగాకుండా రాయలసీమ, తదితర కరువు భూములకు మళ్ళిస్తే, కరువుకాటకాలుంటాయా! అటు కోస్తా ప్రాంతంలో అకాల వర్షాలకు వరదల వెల్లువా ఉండదు. పరిష్కారం పాలించే పెద్దలందరికీ తెలిసిందే, కానీ స్వార్థ రాజకీయాలతో నిజాయితీ లోపించినందునే ఎవరికీ కరువుగోడు వినిపించదు. దిక్కు తెలియని స్థితిలో, ఏ మార్గం లేని పాపయ్యలాంటి రైతులకు మిగిలిన చివరి ఆశ వాన చినుకుల కోసం ఆకాశంలోని మబ్బులకేసి ఎగచూడడమే గతి. ఈ చేదునిజాన్ని వివరించే "వానకురుస్తే" కథ నాకెంతగానో నచ్చింది.

వానకోసం పడిగాపులతో రైతులు కలవరించి, కలవరించి చివరికి నిరాశతో అన్ని దారులూ చెదిరిపోగా, కరువు బతుకు భీభత్సాన్ని భరించలేక గుండెలు పగిలి చచ్చే దయనీయస్థితి ఈ కథలో కనిపిస్తుంది. ఇరవై సంవత్సరాల కిందటే రాయలసీమలో ఇంత దారుణ స్థితి ఉంటే, ప్రస్తుతం ఇంకెంత భయంకరంగా ఉంటుందో ఊహింపచేసి, హృదయాలను కదిలించే దీనస్థితిని కళ్ళముందు నిలిపే కథ "వానకురుస్తే".

కరువునేల రాయలసీమలో పుట్టిపెరిగిన విశ్వనాథ రెడ్డిగారు, ప్రత్యక్షంగా ఆ జీవితాన్ని చవిచూసి, నిజాయితీగా కరువు రైతు బతుకు విషాదాన్ని ఈ 'వానకురుస్తే' కథలో యథార్థంగా చిత్రించారు.

*

# వానకురిస్తే

## కేతు విశ్వనాథరెడ్డి

తెలుగు కథ అంతర్జాతీయ స్థాయిలో తన కీర్తి పతాకను ఎగురవేసిందనే సత్యం సాహిత్యాభిమానులందరికీ తెలిసిందే. ఆనాటి నుండి ఈనాటి వరకు మనకు మంచి కథలకు కొదవలేదు. సాహిత్యపు విలువల్ని జీవితపు విలువల్ని ప్రతిబింబించే ఆనాటి ప్రసిద్ధ కథకుల కలం నుండి జారిన పసిడి తునకల వంటి కథల్ని ఏరి ఈతరం వారికి అందించి, వాటి విలువల్ని విశ్లేషించే ప్రయత్నమే ఈపాతకథ పరిచయం.

వాన కురుస్తే! వొక్కవాన అదునుకు కురుస్తే!!

ఆశనిండిన కళ్ళతో ఆకాశంలో కదలుతున్న మబ్బుల్ని చూస్తూ అనుకున్నాడు పాపయ్య.

వాన కురుస్తే మిరపకు పులక అవసరం వుండదు, సెనక్కాయ విత్తవచ్చు, సేద్యాలయినాయి. నిమ్మచెట్టుకు నీళ్లపారకం బాధ తప్పుతుంది.

తొమ్మదిమట్లు తెగినా, వొక అరెకరంకూడా పారకానికిరాని నీళ్ళున్న బావిని చూస్తూ, గాలికి గిలగిలలాడుతున్న మిరపమొక్కల్ని చూస్తూ, భవిష్యత్తు చెప్పని, చీనీచెట్లను చూస్తూ పాపయ్య ఆశగా అనుకొన్నాడు, వానకురుస్తే!

అవును, యీయేడైనా వానలు అదునుకు బాగాపడితే, యెకరం మిరపచెట్లు దండిగా కాస్తే, ధరలు పలికితే, మూడెకరాల్లోని పై సెనక్కాయ బాగా పండితే, యీతోట్లోనే పై పైరువల్ల నాలుగైదు వేలు చేతికొస్తుంది, యీసారి చెట్లను కాపుకువదిలితే, వానలువచ్చి బావిలో నీళ్లెక్కితే నిమ్మచెట్లమీద తొలికాపుకే హీనంగా నాలుగయిదువేలు చేతికిరాల్తుంది. వెలిపైరంతా ఖర్చులకుపోనీ, యేడెకరాలలో జొన్న, పదహైదెకరాల్లో తీగ సెనక్కాయ, పత్తి, యీయేడు సగానికిపైగా బాకీలు తీరతాయి! తప్పక తీరతాయి. బాకీలకన్నా దరిద్రమూలేదు, నరకమూలేదు. బాకీలున్న యేకుటుంబమూ యీరోజుల్లో ముందుకురాదు, బాకీలున్న మనిషి మనిషికాడు. తానేం మనిషి? తనకూ, తమ కుటుంబానికీ వొకప్పుడున్న గౌరవం యీనాడుందా? చుట్టుపట్ల పల్లెల్లో, బంధువుల్లో వొకప్పుడున్న మర్యాద యిప్పుడుందా? యీనాడా గౌరవం, మర్యాద యెక్కడున్నాయి? వాళ్ళందరూ నీదగ్గర డబ్బులేదు కాబట్టి. నీ కాస్తి తరిగిపోయింది కాబట్టి. నీకు బాకీలున్నాయి కాబట్టి. నిన్ను గౌరవించడంలేదు అని ముఖంమీద అనరు. కానీ వెనక అనేకరకాల మాటలంటారు. అవమానిస్తారు. హింసిస్తారు. అందుకే తాను డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆశకొద్దీ అప్పుచేసి బావి తవ్వించాడు. నమ్మకంకొద్దీ నిమ్మచెట్లు వేసినాడు. కానీ ఆశ చెడ్డది. ఆశ అన్యాయం చేస్తోంది. నమ్మకం చెడ్డది. నమ్మకం ముంచుతోంది. వానల్లేవు. అన్ని బావులలో మాదిరే యీ బావిలోనూ నీళ్ళు లోతుకు, యింకా లోతుకు పోతున్నాయి, యెక్కడికి పోతున్నాయో? నిమ్మచెట్లే కాస్తే చేసిన అప్పులు వొక లెఖ్కకాదు, తన ఆశా. నమ్మకమూ నెరవేరే విషయం యేమో కానీ అప్పుల దయ్యం తన్ను పట్టుకొంది. తన వంశంలోయేదోపద్ధతిలో, యేదో కారణానికి,



యేదో దశలో అప్పులు చేయుందెవరు? అవును, చేయక తప్పేదేముంది? మెట్టన్నమ్ముకొన్నవాళ్ళు యెవళ్ళూ బాగుపడరు. యెప్పుడూ బాగుపడరు. వానలు అదునులో వస్తే బాగుపడతారు.

పాపయ్య బాధగా ఆలోచిస్తున్నాడు.

"నిమ్మచెట్లేసి యెన్నాళ్ళయింది?"

ఆ దోవన పక్కూరికి పోతున్న వొకరెవరో అడిగారు, యీ ప్రశ్నతో పాపయ్య లోకంలో పడినాడు.

"అయిదేళ్ళయింది."

"కాపుకు విడిచినారా? భూమి బ్రహ్మాండమయిన భూమి, చెట్లకు బాగా లాయికీ అయిందే. యింతకూ చెట్లను చూస్తే నీటి పారకం తక్కువైనట్లుందే, యేం? బావిలో నీళ్ళు తక్కువౌస్తున్నాయా?" మళ్ళీ ప్రశ్నించినాడు.

చెట్లకు భూమి లాయికీ అయిందన్నప్పుడు యెంతో వుత్సాహంగా తన పథకాలను అన్నీ చెప్పాలనుకొన్న పాపయ్య, నీళ్ళ సంగతి యెత్తే వేళకు నీళ్ళుగారిపోయి 'ఆ' అని ఘుక్తసరిగా సమాధానించినాడు. దారిని పోతూన్న వాళ్ళంతా బావిదగ్గరకు వచ్చి నిలబడినారు. యిందాకా ప్రశ్నించిన పెద్దమనిషే తన ధోరణిలో చెప్పుకొనిపోయినాడు.

"వూహు లాభంలేదు. యీ వానలు సరిగ్గా కురవని కాలంలో నిమ్మచెట్లు పెట్టుకోవడం దండగ. వొట్టి బుద్ధితక్కువ. మా వూళ్ళో వొకప్పుడందరూ చీనీచెట్లమీద యెగబడినవాళ్ళే, నీళ్ళు చాలక చెట్లు కొట్టేసుకుంటున్నారు. వొక్క బావికే యిరవై వేలు ఖర్చుపెట్టిన వాళ్ళున్నారు. నీళ్ళుంటేనా?"

పాపయ్యకు అతనితో మాటలలో దిగడం యిష్టంలేదు. వాళ్ళకు దూరంగా తోటలోకి నడిచినాడు. ఆ పెద్దమనిషి పక్కన్న వాళ్లతో తోటల్ని గురించీ, బావుల్ని గురించీ యింకా మాట్లాడుతూనే కదలిపోయినాడు.

పీడ వదిలింది.

అవి పాపయ్యకు యిష్టంలేని మాటలు.

మనసుకు కష్టం కలిగించే మాటలు. వాన్ని చంపాలన్నంత కోపం వచ్చింది.

లేకపోతే వాడేం మొనగాడా? నీళ్లెక్కడబడేదీ తెలిసిన శాస్త్రగాడా? తనకన్నీ తెలీదనుకున్నాడా? తానిదంతా ఆలోచించలేదనుకున్నాడా? అదే పనిగా స్వామివార్ని పిలిపించి లగ్నం పెట్టి, చేలో యిటువైపు యీ గట్టున బావి తవ్విస్తే, ఆ వెధవ లాభంలేదంటాడా? తన బావి సంగతి వాడికేం తెలుసు?

పాపయ్యకు చిరాకూ, కోపం కలిగినాయి, వొకచోట పడిపోయిన గోడమీద కంపను తొలగించుకొంటూ తోటలోకి ఆ సమయంలో దొంగగా రావాలనుకుంటున్న దున్నపోతుమీద బలంకొద్దీ రాయి విసిరి కసి తీర్చుకున్నాడు.

వాడు చెప్పిందీ నిజమేనేమో! అయినా తొమ్మదిమట్లు దిగినా నీళ్ళు సరిగ్గా పడలేదంటే యింకెక్కడ పడతాయి? స్వామివారితో యీ విషయమే అంటే ఆయనన్నారు:

> వానలు దండిగా పడితే యీ బాధలుండవు. యీ భయాలుండవు. వానలు కురిస్తే బావికి నీళ్ళెక్కుతాయి. బావిలో నీళ్ళెక్కితే నిమ్మ చెట్లు వొక్క కాపుకు విదిలించి కొడతాయి; పైర్లు బాగా పండుతాయి.

తప్పకుండా పడతాయి. దేవికూడా అదే చెప్పింది. పైగా నేను లగ్నం పెట్టిన వేళా విశేషం అట్లాంటిది. తూర్పుదిక్కున ఆ చిన్న వూటవుందే అటువైపు బోరింగు వేయించు. బుగ్గపుటాల, నీళ్ళు లోపల్నుంచీ యెగదన్నకపోతే, జల ఉబక్కపోతే నన్నడుగు. పదార్స్వరు యింజనులు రెండు, నాల్గించి బొంగుల్తో కొట్టినా తరగవుచూడు. వీరారెడ్డి బావిలో నేను నీళ్ళు పడతాయని చెప్పితే పళ్లేదా? వాక్కు తప్పదు పాపయ్యా.

నిజమేనేమో! లేకపోతే నా ఖర్మేమో! బోరింగు వేయించాల, లోపల చట్టువుందో, బండవుందో? స్వామివారి వాక్కుబలం: బోరింగు వేయించాల. కనీసం నలభైయాభై అడుగులు దించాల. కానీ డబ్బు! డబ్బు! యెక్కన్నుంచి తేవడం? పాతప్పులే తీర్చడానికి భయంగావుందే, కొత్తప్పుల్ని తేవడమెట్టా? తీర్చడమెట్టా? తేవడం, తీర్చడం, తేవడం బతుకింతేనా?

వానలు దండిగా పడితే యీ బాధలుండవు. యీ భయాలుండవు. వానలు కురిస్తే బావికి నీళ్ళెక్కుతాయి; బావిలో నీళ్లెక్కితే నిమ్మచెట్లు వొక్క కాపుకు విదిలించి కొడతాయి; పైర్లు బాగా పండుతాయి.

అట్లాంటప్పుడు మొగవానికి వొక పదహైదువేల అప్పు లెఖ్ఖా పత్రమా? వడ్డీల్తో సహా నీతికీ నిజాయితీకి కట్టుబడి బాకీల్ని తీర్చే గుణం తమ వంశ రక్తంలోనే వుంది.

పాపయ్య వంశరక్తం గర్వంతో కులికింది.

తన అబ్బ అణా పైసల్తో అప్పు తీర్చినాడు-- ఆస్తి అమ్మి తీరిస్తేనేంకాక! తన తండ్రి చచ్చిపోతూ ఋణం వుంచుకోకూడదు. అందులోనూ బంధువులదగ్గర - అంటే, తాను కమామిషికి వచ్చిన మొదట్లో పదెకరాలు అమ్మి వడ్డీతోసహా తీర్చినాడు. యింత నిక్కచ్చిగా బాకీలు తీర్చేవాళ్ళు యీ రోజుల్లో లేరు, అదే మరొకళ్లయితేనా ఆస్తులు యెవళ్లో వొకళ్ళ పెరబెట్టుకొని. సొమ్ము వెనకేసుకొని, దొంగబాండుల్ని పుట్టించి, అయిపీ పెట్టి సంపాదించుకుండేవాళ్ళు. నీతికీ, అభిమానానికీ కట్టుబడకుండా డబ్బు సంపాదన యెందుకు? డబ్బులేకపోతేనేంగాక, ఆస్తి తగ్గిపోతేనేంగాక, తమ కుటుంబానికి పరువుంది; ప్రతిష్ట వుంది. పరువు ప్రతిష్ట, లేనివాళ్ళదగ్గర యెంత డబ్బుంటే నేం? అంగడి రామిరెడ్డికీ కావల్సినంత డబ్బుంది. దొంగ సారాయమ్మి, దొంగ సల్ఫేటమ్మి, నానా దొంగ గడ్డీ తిని మిగిలించిన డబ్బుంది. ముచ్చొడ్డీలకిచ్చి సంపాదించిన డబ్బుంది. కొంపలు కూల్చిన డబ్బుంది. యీ రోజుల్లో యెంత నీతిని విడిస్తే, యెంత సిగ్గుని విడిస్తే, యెంత యితర్లను మోసగిస్తే అంత డబ్బు సంపాదించవచ్చు.

రామిరెడ్డీ, అతని డబ్బూ, సంపాదనా, స్మృతిలో మెదిలేసరికి పాపయ్య మనస్సు అసహ్యంతో నిండిపోయింది.

వాడి దగ్గర వెయ్యి రూపాయలు వీల్లేక, యిబ్బందులకు తట్టుకోలేక, వడ్డీకి తెచ్చినాడు. ముచ్చొడ్డీకి; నూటి కయిదు రూపాయలుకు; యెవరికీ తెలియకుండా - కట్టకడపటకు కడపున పుట్టిన కొడుక్కు- పెద్దకొడుక్కు- తెలీకుండా తెచ్చినాడు. అప్పులు చెయ్యకుండా బతకడం అసాధ్యమై పోతోంది. యేవో ఖర్చులు తగులుతున్నాయి. పెళ్ళిళ్ళఖర్చులు, యింటి ఖర్చులు, చదువుల ఖర్చులు. రోగాల ఖర్చులు, చావు

ఖర్చులు, వానల్లేక ఖర్చులు, మరేవోఖర్చులు, బాకీలు. కానీ యిట్లాంటి బాకీలు, రామిరెడ్డి దగ్గర తెచ్చిన్లాంటి బాకీలు, పగవాడు కూడా చేయకూడదు. వాడు ప్రతినెలా వడ్డీ తీసుకొంటూనే వాయిదా మాత్రం సంవత్సరం పెట్టినాడు. యింక మూన్నెళ్లు- మూన్నెళ్ళకు వాయిదా ముగుస్తుంది. వాన కురిస్తే మిరపకాయలు తొలికోత తెగేసరికి వాడిడబ్బు వాడి మొఖాన కొట్టాలి. లేకపోతే వాడు గుంటనక్క, యిట్లాంటివాళ్ళ దగ్గర అప్పులు చేయకూడదు.

పాపయ్యలో దైన్యం ఆవరించింది.

ఆకాశంలో చెడుగుడు ఆడుతున్న మబ్బులు, విడిపోతున్న మబ్బులు, కలుస్తున్న మబ్బులు, గాలి, పూనకం పట్టినట్లు వీసే గాలి, వురుము, వురుము.

"అర్జునా! అర్జునా!"

మెరుపు. మెరుపు. కళ్ళను చెదరగొడుతున్న మెరపు. చినుకులు. చినుకుల చిట పట.

పాపయ్య హృదయం ఆనందంతో పులకించింది.

చినుకులు, పెద్ద చినుకులే. తప్పకుండా యివాళ పెద్దవానే పడుతుంది. మిరపచెట్లకు పులక, సెనక్కాయ విత్తనం, బావిలో నీళ్ళు, నిమ్మచెట్ల పాదుల్నిండా నీళ్ళు, యీ కార్తెలోనే పెద్ద వానలు పడతాయని పంచాంగంలో వుంది. యీ కార్తె నిన్న మొదలైంది. పంచాంగం తప్పదు. వాన కురవడం తప్పదు.

గబగబా నెత్తిమీద వల్లె వేసుకొని పాపయ్య యింటిముఖం పట్టినాడు. యెక్కువవుతున్న గాలి విసురు, ముసురుకొస్తున్న చీకటి. విసిరికొడుతున్న గాలి, ముఖం మీద చురుక్కుమనే చినుకులు, అంతంత మాత్రం చూపలున్న పాపయ్య, తన శరీర యజ్ఞఫలాన్ని పిత్రుగ్రుహబంధు దేవతలకు అర్పించిన పాపయ్య, తొట్రుపాటులో వొక చేనిగట్టు తగిలి కిందపడినాడు. పాపయ్య, దీనంగా మూలిగి, మోచేతులతో మోకాలి చిప్పల్ని బిగదన్ని మెల్లగా లేచినాడు. గుండె దడ మొదలైంది. మళ్ళీ వస్తుందా? గుండెపోటేమైనా మళ్ళీవస్తుందా? వాన కురుస్తేచాలు. మళ్ళీ రానీ, తాను చస్తేనేం? బాకీలు తీరకుండా చావకూడదు. సంసారాన్ని తలెత్తుకొనేట్లుచేసి మరీ చావాలి. ఛీ పాడు ఆలోచన. వానమీద యీ గాలికెందుకు కసి కానీ వానవస్తుంది, వస్తోంది, పాపయ్యకు అవ్యక్తమైన భయమూ, ఆనందమూ కలిగినాయి.

ఆలోచనలతోనే వూరు చేరుకొని నిట్టూర్చినాడు.

పంచాయితీ ఆఫీసులో రేడియో వినాలి. యీ దినం వాన కురుస్తుందని, పెద్ద గాలి వానా వస్తాయని రేడియోవాళ్ళు తప్పక చెప్పతారు.

పాపయ్య పంచాయితీ ఆఫీసు ప్రవేశించినాడు. అక్కడ రాజకీయాలు. వొకళ్ళ కొంపల్ని వొకళ్ళు తీసుకొనే రాజకీయాలు. మంచివీ, చెడ్డవీ, అన్ని రకాలవీ రాజకీయాలు.

"యేం మామా తోటకాన్నుంచేనా?" సుంద్రరెడ్డి అడిగినాడు.

పంచాయితీ
ఆఫీసులో రేడియో
వినాలి. యీ దినం వాన
కురుస్తుందని, పెద్దగాలి వానా
వస్తాయని రేడియో
వాళ్ళు తప్పక
చెప్పతారు

"ఆఁ యీవాళ పెద్ద వానే రావచ్చు. వార్తల్లో యేం చెప్పినారూ?" సమాధానం కోసం నలువురివైపూ పాపయ్య చూసినాడు. నలువురూ వాన రావచ్చునంటే ఆత్మతృప్తి.

వస్తుందని వాళ్ళంటారు.

"ఆఁ, ఆ రాయలసీమలో భారీవర్షం పడే సూచనలున్నాయట! రేడియోవాళ్ళ మాట యీవాళ నిజమయ్యేట్లే వుంది." వొక యువకుడన్నాడు.

"రేడియోలో చెప్పినారా? అయితే యిక తప్పకుండా పడుతుంది. మోడం కూడా దండిగా వుంది." ఆశనూ, ఆసక్తినీ ప్రకటించినాడు పాపయ్య.

"పాపయ్యన్నా! రేడియోలో చెప్పినట్లు వానొస్తే దేవుల్లెందుకయ్యా? యీపాటికి మనమిట్లా వుండేవాళ్ళమా చెప్పు?" కరణం అందుకొన్నాడు.

కరణానికేం దొబ్బుతెగులూ 'మనమం'టాడు. మధ్యలో తనకేమైంది? చచ్చేవాళ్ళు తనలాంటివాళ్ళు కానీ! నక్కలా బతుకుతున్నాడు. పాపయ్య లోలోన వుడుక్కున్నాడు.

"కలికాలం. బ్రహ్మంగారు చెప్పినట్లు యిపుడు రాజ్యం యేలుతున్న దెవరు?" కరణం మళ్ళీ ప్రారంభించినాడు.


"యిప్పడీ తత్వాలలో యేంగానీ యీ పదిరోజులూ బజన్లూ, పానకపందేరం యేర్పాటుచేస్తే బాగుండదా! పాపయ్య మామ విరాటపర్వం సదువుతాడు. యేమంటావు మామా?" సుంద్రరెడ్డి అడిగినాడు.

పాపయ్య సమాధానం చెప్పకముందే కరణం ఉత్సాహంగా అన్నాడు.

"అనేదేముంది? పాపయ్యన్న యెపుడైతే యేది కాదన్నాడూ వూళ్లో సందాలిప్పడే మొదలు పెడ్దాం."

"యీ చెక్క భజన్లు చేయడంకంటే కాస్త మంచిపని చెయ్యకూడదా? యింతకు ముందు చేసిన భజనలు చాలవా? వానా వానా, బావుల్లో నీళ్లో అని యేడుస్తుంటాం కదా? యేం పెద్ద బ్రహ్మండం? యితర దేశాల్లో యిన్నూరు మున్నూరడుగుల లోతు నుంచి నీళ్ళు బయటికి తెస్తున్నారు. మనం యేడెనిమిది ఘట్లకే యేడుస్తాం. తాలుకాకు పది రిగ్గులు దించమను. అగ్గువగా






బావులు త్రవ్వించమను. భూమిలో నీళ్ల లేకేం? పోనీ మన చెరువును మర్యాదగా కట్టివుంటే, కనీసం బావుల్లోనైనా నీళ్ళుండక పోయేవా? అయిదు లక్షలు పోశారు కదా? చాకలోళ్ళు గుడ్డలుతుక్కోడానికి కూడా నీళ్ళు నిలబడవు. యెట్లా నిలబడతాయి. పోసినమట్టి కొట్టుకొని పోతోంటే? దీన్ని గురించి పట్టించుకోరు. యీ చెరువే వుంటే, ఆ గండికోట ప్రాజెక్టే కట్టివుంటే, పోనీ ఆ తుంగభద్ర యెగువ కాలువ వచ్చివుంటే మనకిన్ని బాధలుండేవా? వానదేవుడో అంటూ భజన్లు చేస్తారు. కానీ అసలు సమస్యల్ని పట్టించుకోరు." ఆవేశంగా పట్టాభి అన్నాడు. పట్టాభి విజ్ఞానియైన నిరుద్యోగి. వుద్రేకి.

"అవునయ్యా నీకేకలయితే బావుండాయి. యీ సంగతి యెవర్నడగాల?"

యితరులను వాదనలోకి దింపడం కరణానికి యెంతో యిష్టం. వాదనలో తనె లాగా దొరకడు. కానీ యితర్ల పిలక తనకు దొరుకుతుంది. దొరికితే అవసరమైనప్పుడల్లా నాటకం ఆడించవచ్చు.

"ప్రభుత్వాన్ని" పట్టాభి తెంచినట్టు సమాధాన మిచ్చినాడు.

అందరూ దొంగలే. యీ మనుషులు బాగుపడరు. యీ వూరు బాగుపడదు. యీ దేశం బాగుపడదు. అందరూ చస్తారు. అప్పుల్తో చస్తారు. పనికిమాలిన రాజకీయాలతో చస్తారు.

"ప్రభుత్వమంటే యెవరు? మన రెడ్డి గంగిరెడ్డి. మన ప్రెసిడెంటు సిద్దయ్యనాయుడు. గంగిరెడ్డి బావమరది చెరువు కంట్రాక్టరు. సిద్దయ్యనాయుని బంధువు యింజనీరు. వీళ్ళనడగ్గలమా చెప్పు? కరణం లౌక్యాన్నంతా ప్రదర్శించినాడు."

"అడగలేకేం? మన ప్రభుత్వంలో మరొకరిని మరిచి పోయినావే" గంభీరంగా పట్టాభి అన్నాడు.

"యెవర్ని?"

కుతూహలంగా ప్రశ్నించాడు కరణం. చర్చ పాకాన పడుతోంది. పట్టాభి అంతు తేల్తుంది. వొక ఆట ఆడించవచ్చు అని మురిసిపోయినాడు కరణం.

"నిన్నే. ప్రభుత్వంలో వాళ్ళు చక్రాలయితే, చక్రాల్ని తిప్పే తెలివితేటలు నీలాంటివాళ్ళవి కదా!" పట్టాభి చురక తగిలేసరికి కరణానికి కోపం వచ్చింది.

"పెద్దంతరం చిన్నంతరం లేదు. గుడ్డొచ్చి పిల్ల నెక్కిరిస్తాది. పిదపకాలం, పిదపబుద్ధులు" గొణుగుతూ కరణం అస్త్ర విసర్జనం చేసినాడు.

యీరకం వాదనలు యెక్కడికి దారి తీస్తాయో పాపయ్యకు అనుభవమే.

వీటివల్ల ప్రయోజనం లేదు. "నాకు వొంట్లో బాగాలేదు." అని పాపయ్య వీధిలోనికి వచ్చినాడు. వొకటి రెండు చినుకులు పడుతూనే వున్నాయి.

పట్టాభిమాటల్లో నిజం వుంది. రిగ్గుల సంగతి గొప్పగా చెప్పుకుంటున్నారు యీమధ్య. కానీ మంచినీటి బావులే తప్పుతారట. నిజంగానే ప్రభుత్వానికి శ్రద్ధ వుంటే యిన్ని అవస్థలుంటాయా? పట్టాభి అన్నట్లు వానలు భజనల వల్ల వస్తాయా? పూర్వం వచ్చేవి. యిప్పుడేమో భజనల వల్ల వాన వచ్చినా రాకపోయినా రాజకీయాలొస్తాయి. వూళ్ళో తప్పక - యెగువవీధి భజనగుంపు. దిగువవీధి భజనగుంపుల మధ్య చెరువు నిలిచివుంటే బావుల్లో నీళ్ళుండేవి. వంకకడ్డంగా కట్టదల్చిన చెరువు కాబట్టి వొక పెద్ద వాన కురిసినా చెరువులో నీళ్ళు దండిగా వుండేవి. చెరువు నిలిస్తేనా? అదెందుకు నిలుస్తుంది? తుంగభద్ర కాల్వవొస్తే తన భూమి అయిదెకరాలు పారుతుంది. అది వచ్చేదెప్పుడు?

అందరూ దొంగలే. యీ మనుషులు బాగుపడరు. యీ వూరు బాగుపడదు. యీ దేశం బాగుపడదు. అందరూ చస్తారు. అప్పుల్తో చస్తారు. పనికిమాలిన రాజకీయాలతో చస్తారు.

పాపయ్య మనసులో కసి, గుండెల్లో మంట.

పాపయ్య ఇంటికి చేరుకుని భార్యను ఆత్రంగా అడిగినాడు.

"పైన గవాసులూ అవీ వేయించినావా?" గుమ్మళ్ళేమైనా పడ్తాయేమో మిద్దెమీద సవుదుంది కదా?' '

"ఆc యీ వాన వచ్చిందా సచ్చిందా?" పాపయ్య భార్య వేదాంతం పలికింది.

యేమైనా వానవస్తే యీ యింట్లో వుండడం యిబ్బంది. యీసారి వానలు బాగా కురిస్తే, పంటలు బాగా పండితే మిద్దెవూడబీకి తిరిగి కప్పించాల. దంతెలు పుచ్చిపోయినాయి. నాయన కొత్త మిద్దె కట్టాలనుకున్నాడు కానీ కట్టకుండానే వెళ్ళిపోయినాడు. తాను కొత్తది కట్టకపోయినా పాతదైనా పదిలం చెయ్యాల. యివాళ యీ మోడాన్ని చూస్తే పెద్దవానే పడుతుంది. గుమ్మళ్ళు పడతాయోమో! పడితే రాత్రంతా జాగారం తప్పదు.

"ముందు తొందరగా భోంచెయ్యి. గబ్బునూనెకూడా అయిపోవచ్చింది. యేం కొంపో?"

భార్య సణుక్కుంటూ చెంబుతో నీళ్ళిచ్చింది. చెంబందుకొని మసికట్టుకుంటున్న కిరసనాయిలు దీపం వైపు చూస్తూ "పెద్దోడెక్కడికి పోయినాడూ!" పాపయ్య ప్రశ్నించినాడు.

"నీవెంతకూ రాకపోయేతలికి నీకోసం తోటదగ్గర కొచ్చినాడే. యెదురుపల్లేదా? అంత పొద్దుపోయిందాక ఆ తోట దగ్గర వుండకపోతే కారిపోయిందా?"

పాపయ్య భార్యకు, జీవితం విసుగునిచ్చింది తప్ప, యింకేమీ యివ్వలేదు.

పెద్దకొడుక్కు తనమీద తగని

ప్రేమ. తన కొడుకులంతా అట్లాంటి వాళ్ళే. యిప్పుడే చీకట్లో తనకోసం తోటదగ్గర కెళ్లినాడు.

"వాడు వానలో చిక్కుకుంటాడేమో" పాపయ్య అన్నాడు.

"నీకే మద్దెన వానపిచ్చి పట్టింది." భార్య వడ్డిస్తూ అంది.

పాపయ్య భోజనం ముగించి యింట్లోంచీ బయటికివచ్చి ఆకాశంవైపు చూచినాడు. చుక్కల్లేవు. మోడమట్లానే వుంది. వొకటి రెండు చినుకులు రాల్తూనే వున్నాయి. పెద్దవాన రానందుకు పాపయ్య విసుక్కున్నాడు.

యీవాన మళ్ళీ యేమైనా యెగదంతుందా? వస్తున్నా వస్తున్నా అని తెగవూరిస్తుంది. యెగదంతుంది. లేదు, యీరోజు తప్పకుండా పెద్దవాన వస్తుంది. పంచాగంలో వుంది. రేడియోలో చెప్పినారు. తన మనసు చెప్తూంది. వాన తప్పదు.

నిద్రవస్తూంది.

యింట్లోకివెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

వుబ్బరంగా వుంది. తెగ వుబ్బరంగా వుంది. గాల్లేదు. వానొస్తే తర్వాత చూసుకోవచ్చు.

పాపయ్య మంచం బయట వేసుకొని పడుకున్నాడు. పగలంతా తోటకాడ పని. ఆలోచనలూ, ఆశలూ నిరాశలు. అలసిపోయిన పాపయ్యకు వెంటనే నిద్ర కమ్మింది.

నిద్రలో పాపయ్యకు వొక కల వచ్చింది. పెద్ద వాన పడుతోంది. చెరువు నిండింది. తోటపక్కన్నే గట్టుల్ని యెగదంతూ పారుతున్న కాలవ. బావిలో నీళ్ళు. పాదుల్లో నీళ్ళు. యింట్లోనీళ్ళు. వీధిలో నీళ్ళు. తనమీద నీళ్ళు. యెక్కడ చూచినా నీళ్ళు. తాను రాసిచ్చిన బాండు కాగితాలన్నీ నీళ్ళల్లో కొట్టుకొని పోతున్నాయి. యెర్రటి మిరప్పండ్లు, బాగా వూరిన సెనక్కాయలు, చీనిపండ్లను మద్రాసుకు మోసుకపోతున్న లారీలు, రూపాయలు, అన్నీ రూపాయలే. రూపాయల్ని తాను వెదజల్లుతున్నాడు. అంగడి రామిరెడ్డి ఆబగా యేరుకుంటున్నాడు. కానీ వాడు నీళ్ళల్లో కొట్టుకొనిపోయి చెరువులో మునిగి పోతున్నాడు. మునిగిపోతున్నాడు. పోతున్నాడు....

వున్నట్టుండి వురిమిన వురుముకు కల చెదిరింది. మంచం లోంచి దిగ్గున భయంతో లేచిన పాపయ్యకు గుండె వేగంగా వేగంగా కొట్టుకొంది. ఆర్తనాదం చేసి పాపయ్య మంచంలోనే కూలిపోయినాడు. ఆకాశం లోంచి ఆ రాత్రి వాన పల్లేదు. యింట్లో వాళ్ళ కళ్ళల్లోంచి పడింది. వానతో చెరువులు నిండలేదు. యింట్లో వాళ్ళ గుండెలు చెరువులయినాయి. పాపయ్య శవాన్ని చేయించిన స్నానపునీళ్ళు కాలువలు గట్టినాయి.

వుదయం వూళ్ళోవాళ్ళంతా పరామర్శించడానికి వచ్చినారు. పాపయ్య పెద్ద కొడుకు మల్లయ్యను పక్కకు పిలిచి సుందర్రెడ్డి అన్నాడు.

"యిప్పుడు విచారించి లాభమేముంది? జరిగే పని చూడాల. పాపయ్య మామ బతికినన్నాళ్లూ బయట పడకుండా బతికినాడు. కొంత అప్పుల బాధేదో వున్నట్లుంది. నాతో అనేవాడు యెప్పుడన్నా, మీ నాయన లోతుమనిషి. నీకేమైనా చెప్పినాడా?"

పాపయ్య తనక్కూడా బాకీ వుండే సంగతి సుందర్రెడ్డి చెప్పకుండా, జరిగే పని చూడమని మల్లయ్యకు చెప్పినాడు. మల్లయ్య దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ అన్నాడు.

"నేనెప్పుడూ నాయన యేంచేసినా వొక్కమాట అడగలేదు. అప్పలున్నాయని తెలుసు. యెంతుండాయో తెలీదు. యెన్ని బాకీలున్నా తప్పకుండా తీరుస్తాను మామా తీరుస్తాను. మా వంశం సంగతి నీకు తెలీదా? గొంతులో ప్రాణం వున్నంత వరకు వొకరికి బాకీలు యెగవేయం."

అంగడి రామిరెడ్డి భుజం మీద చేయి వేసి మల్లయ్యతో నెమ్మదిగా అన్నాడు.

"చూడు మల్లయ్యా! యీ మద్దెన మీ నాయన నాదగ్గర చేసిన బాకీని గూర్చి దిగులు పెట్టుకోవద్దు. తొందరేం లేదులే. నిదానంగా చూసుకోవచ్చు. దివసాల అయ్యాక అంతగా అయితే రాతకోతలూ అవీవుంటే చూసుకోవచ్చు."

రామిరెడ్డి కూడా మంచోడే. యిలాంటి వాళ్ళు వుండబట్టే తన యింటి గౌరవం నిలిచింది. మల్లయ్య కళ్ళు కృతజ్ఞతతో మెరిసినాయి.

రామిరెడ్డి ఆత్రగాడుకాదు. గాలానికి బాగా చిక్కిన తర్వాత చేపను బయట వేస్తాడు. యీ చేప బాగా దొరుకుతుంది. రామిరెడ్డి మనసులో అంకెలు దొర్లుతున్నాయి.

దివసాలు ముగిసినాయి. మల్లయ్యకు యింటి విషయాలన్నీ నెమ్మదిగా పడుతున్నాయి. తండ్రి మరణానికి ముందు మల్లయ్య పొలం పనుల గూర్చి మాత్రమే ఆలోచించేవాడు. తండ్రిదే పెత్తనం కాబట్టి, యిప్పుడు పొలం పనులు, యింటిబాధ్యతలు, బాకీలూ, డబ్బు బాధలూ.

నెల రోజుల తర్వాత మల్లయ్య వొక రోజు తోట దగ్గరకు వెళ్ళినపుడు బావిగట్టున నిలబడి అనుకున్నాడు.

నాయన పోయినాక వొక వాన వచ్చింది. యింకొక మంచి వాన కురుస్తే యీ మిరపచెట్లకు కాయ బాగా పడుతుంది. ధరలున్నాయి. సెనక్కాయతీగ బాగా సాగుతుంది. ధరలు పెరుగుతున్నాయి. నిమ్మచెట్లకు పూత వస్తుంది. రెండు మూడు లారీలు కాస్తాయి. బావిలో నీళ్ళు సరిపోతాయి. అన్నీ కుదిర్తే యేముంది? బాకీలు సుమారుగా తీర్చవచ్చు. బాకీలెంతబాధ! బాకీలు తీర్చాలి.

బావిలోకి చూస్తూ, ఆకాశం వైపు చూస్తూ, ఆ మధ్య వచ్చిన వొక వానతో బ్రతకలేక చావలేక అవస్థ పడుతున్న మిరప చెట్లను చూస్తూ, నీరెత్తని నిమ్మచెట్లను చూస్తూ అనుకొన్నాడు.

వొక్క వానకురిస్తే! మరొక్క వాన కురిస్తే!!!

